దక్షిణాఫ్రికా X స్కాట్లాండ్ మ. 3.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో | భారత్ X శ్రీలంక రా. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

# భారీ తేడాతో గెలిస్తేనే..




**శ్రీలంకతో భారత్ నేడు కీలక పోరు**

**సెమీస్ చేరాలంటే నెట్ రన్‌రేట్ కీలకం**

**మ్యాచ్‌కు హర్మన్‌ప్రీత్ అనుమానమే!**

దుబాయ్: ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో బుధవారం మరో కీలక పోరుకు తెరలేవనుంది. సంక్లిష్టంగా ఉన్న సెమీస్ అవకాశాలను దాటుకుని రేసులో నిలవాలంటే భారీ తేడాతో గెలవాల్సిన మ్యాచ్‌కు భారత మహిళల క్రికెట్ జట్టు సిద్ధమైంది. గ్రూప్-ఏలో భాగంగా దుబాయ్ వేదికగా బుధవారం రాత్రి టీమ్‌ఇండియా.. శ్రీలంకతో తలపడనుంది. నెట్ రన్‌రేట్ అత్యంత కీలకమైన భారత్‌కు ఈ మ్యాచ్‌లో అసాధారణ ఆటతీరుతో ప్రత్యర్థిని ఓడిస్తేనే సెమీస్ అవకాశాలు మెరుగవుతాయి. గ్రూప్-ఏలో పాకిస్థాన్‌తో పాటు రెండేసి మ్యాచ్‌లు ఆడినా భారత్ నెట్ రన్‌రేట్ -1.127తో నాలుగో స్థానంలో ఉండగా పాక్‌కు +0.055తో మూడో స్థానాన ఉంది. ఈ నేపథ్యంలో లంకతో మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిస్తేనే భారత్ సెమీస్ రేసులో నిలుస్తుంది.

**బ్యాటర్లు జూలు విదిల్చాల్సిందే..**

ఈ టోర్నీలో ఆడిన గత రెండు మ్యాచ్‌లలో భారత్ బ్యాటింగ్ విభాగం విఫలమైంది. ధనాధన్ ఆటతో ఆది నుంచే ప్రత్యర్థులపై విరుచుకుపడే షఫాలీ వర్మ, స్మృతి మంధాన క్రీజులో నిలబడలేకపోతున్నారు. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో షఫాలీ 2 పరుగులే చేయగా మంధాన 12 రన్స్ చేసింది. పాక్‌తో షఫాలీ 32 పరుగులతో రాణించినా ఆమె సహజశైలికి భిన్నంగా నిదానంగా ఆడింది. మంధాన 7 పరుగులే చేసి నిష్క్రమించింది. జెమీమా, రిచా వంటి హిట్టర్లు భారీ షాట్లు ఆడాల్సి ఉంది. పాక్‌తో మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గాయం కాగా లంకతో ఆమె ఆడేది అనుమానంగానే ఉంది. దీంతో మిడిలార్డర్‌లో జెమీమా, రిచాపై అదనపు భారం పడనుంది.

**బోణీ కోసం లంక ఆరాటం..**

ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన లంకకూ ఈ మ్యాచ్ కీలకమే. నేటి పోరులో ఓడితే ఆ జట్టు ప్రపంచకప్ నుంచి అధికారికంగా నిష్క్రమించినట్టే అవుతుంది. సారథి చమరీ ఆటపట్టు మంచి ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు కలిసొచ్చేదే. గత రెండు మ్యాచ్‌లలో ఓడినా లంకను తేలికగా తీసుకుంటే తప్పులో కాలేసినట్టే అన్న విషయం భారత్‌కు బాగా గుర్తే. ఈ ఏడాది ముగిసిన ఆసియా కప్‌లో ఆ జట్టు భారత్‌కు షాకిచ్చిన విషయాన్ని మన అమ్మాయిలు మరువరాదు.

## ఆసీస్ జయభేరి

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా వరుస విజయాల జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 60 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత బేత్‌మూనీ(40), ఎలీస్ పెర్రీ (30) బ్యాటింగ్‌తో ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో 148/8 స్కోరు చేసింది. అమెలియా కెర్ (4/26) రాణించింది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కివీస్..స్కట్ (3/3), సదర్లాండ్ (3/21) ధాటికి 19.2 ఓవర్లలో 88 పరుగులకే కుప్పకూలింది. మేగన్ స్కట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

## పాక్ 556 ఆలౌట్

ముల్తాన్: బ్యాటర్లు శతకాలతో విజృంభించడంతో ముల్తాన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్థాన్ 556 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓవర్ నైట్ స్కోరు 328/4 వద్ద రెండో రోజు ఆట ప్రారంభించిన పాక్‌కు అఘా సల్మాన్ (104 నాటౌట్) మరో శతకం బాదగా సౌద్ షకీల్ (82) రాణించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇంగ్లండ్.. రెండో ఓవర్లోనే కెప్టెన్ ఓలీ పోప్ (0) వికెట్‌ను కోల్పోయినా జాక్ క్రాలే (64 బ్యాటింగ్), జో రూట్ (32 బ్యాటింగ్) దూకుడుతో ఇంగ్లండ్ ఒక వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది.



## 100మీ విజేతలు గణేశ్, కైఫ్

**ముగిసిన తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీ**

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 8: స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల రెండో రోజు జరిగిన బాలుర అండర్-18 100మీ రేసులో గణేశ్ స్వర్ణ పతకంతో మెరిశాడు. ఇదే విభాగంలో హర్షవర్ధన్, అశోక్ వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. బాలుర అండర్-20 100మీ రేసులో కైఫ్‌కు పసిడి లభించగా, రాఘువేంద్ర, గణేశ్‌కు రజత, కాంస్యాలు ఖాతాలో వేసుకున్నారు. 100మీ రేసులో షేక్ సుహానీ(అండర్-18), ప్రవళిక(అండర్-20) స్వర్ణాలు సొంతం చేసుకున్నారు. జావెలిన్‌త్రో(అండర్-20)లో స్వామి పసిడి విజేతగా నిలిచాడు. ముగింపు కార్యక్రమంలో పారాలింపియన్ దీప్తి, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ రమేశ్, అసోసియేషన్ ప్రతినిధులు సారంగపాణి, రాజేశ్వర్‌రావు, కుమార్‌యాదవ్, డీవైఎస్‌వో అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

**నేడు భారత్, బంగ్లా రెండో టీ20**

# ఢిల్లీలోనే పట్టేయాలని..

**జోరు మీదున్న భారత్.. సిరీస్ కాపాడుకునేందుకు పర్యాటక జట్టు యత్నం**




ఢిల్లీ: స్వదేశంలో బంగ్లాదేశ్‌పై మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న భారత క్రికెట్ జట్టు.. బుధవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరుగబోయే రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. గ్వాలియర్‌లో తొలి టీ20 నెగ్గిన ఊపులో ఉన్న సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని యువ భారత్.. ఢిల్లీలోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను ఒడిసిపట్టుకోవాలని భావిస్తోంది. రిషభ్, అక్షర్, బుమ్రా, గిల్, జైస్వాల్ వంటి స్టార్ ఆటగాళ్లు అందుబాటులో లేకున్నా అభిషేక్, మయాంక్, నితీశ్ లాంటి యువ క్రికెటర్లతోనే సత్తా చాటింది. మరోవైపు తమకంటే తక్కువ అనుభవం ఉన్న జట్టుతో ఆడి తొలి టీ20లో దారుణ పరాభవాన్ని మూటగట్టుకున్న బంగ్లాదేశ్.. ఢిల్లీలో అయినా గెలిచి సిరీస్ ఆశలు నిలుపుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం నాటి మ్యాచ్ రసవత్తరంగా సాగనుంది. ఢిల్లీ పిచ్ బ్యాటర్లకు అనుకూలించే అవకాశాలు మెండుగా ఉండటంతో భారీ స్కోర్లు నమోదయ్యే చాన్స్ ఉంది.

**సంజూ, అభిషేక్ ఏం చేసేనో?**

రెగ్యులర్ ఓపెనర్లు గిల్, జైస్వాల్‌కు విరామంతో గ్వాలియర్‌లో ఓపెనర్లుగా వచ్చిన వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్, యువ సంచలనం అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. ఈ ఇద్దరూ ఇన్నింగ్స్‌ను ధాటిగానే మొదలుపెట్టినా వాటిని భారీ స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. ముఖ్యంగా శాంసన్‌కు వరుసగా అవకాశాలిస్తున్నా విఫలమవుతుండటం ఆందోళన కలిగించేదే. ఈ నేపథ్యంలో అతడికి నేటి మ్యాచ్ కీలకం కానుంది. అభిషేక్ భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. తొలి మ్యాచ్‌లో కెప్టెన్ సూర్య, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా దూకుడుగా ఆడగా ఢిల్లీలోనే అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. వీళ్ల దూకుడుతో టార్గెట్‌ను భారత్ 12 ఓవర్లలోనే ఊదేసింది. యువ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి ఫర్వాలేదనిపించినా జట్టులో స్థానాన్ని కాపాడుకోవాలంటే ఇంకా మెరుగ్గా రాణించాల్సి ఉంది. గత మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన మయాంక్ యాదవ్ తన పేస్ పదును చూపిస్తే బంగ్లా బ్యాటర్లకు తిప్పలు తప్పవు. ఈ మ్యాచ్‌లో భారత్ తుది జట్టులో మార్పులేమీ చేయకపోవచ్చు.

**సిరీస్ కాపాడుకునేందుకు..**

తొలి టీ20లో బ్యాటింగ్ వైఫల్యంతో దారుణంగా ఓడిన బంగ్లాదేశ్.. ఢిల్లీలో మాత్రం పుంజుకోవాలని చూస్తోంది. లిటన్ దాస్, నజ్ముల్ హొసేన్ శాంతో, మహ్మదుల్లా, తౌవిద్ వంటి హిట్టర్లు ఉన్నా వాళ్లంతా నామమాత్రపు స్కోర్లకే పరిమితమయ్యారు. మిరాజ్ ఒక్కడే ఉన్నంతలో ఫర్వాలేదనిపించాడు. కానీ ఢిల్లీలో మాత్రం ఆ తప్పులను మళ్లీ చేయకుండా పక్కా ప్రణాళికతో భారత్‌కు షాకిచ్చి సిరీస్‌పై ఆశలు కాపాడుకోవాలని పర్యాటక జట్టు భావిస్తోంది. తొలి మ్యాచ్‌లో బంగ్లా బౌలింగ్ కూడా నాసిరకంగా ఉండటం ఆ జట్టుకు ఆందోళన కలిగించేదే.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** అభిషేక్‌శర్మ, సంజూ శాంసన్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), నితీశ్‌రెడ్డి, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్

**బంగ్లాదేశ్:** పర్వేజ్ హొసేన్/తాంజిద్, లిటన్ దాస్, శాంతో (కెప్టెన్), తౌహిద్ హృదయ్, మహ్మదుల్లా, జాకీర్ అలీ, మెహిది హసన్ మిరాజ్, రిషద్ హొసేన్, టస్కిన్ అహ్మద్, షోరిఫుల్ ఇస్లాం, ముస్తాఫిజుర్

## మహ్మదుల్లా రిటైర్మెంట్



*బంగ్లాదేశ్ వెటరన్ బ్యాటర్ మహ్మదుల్లా టీ20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్‌తో హైదరాబాద్ వేదికగా జరిగే మూడో మ్యాచ్ ఈ ఫార్మాట్‌లో తన ఆఖరి మ్యాచ్ అని తెలిపాడు. వన్డే ఫార్మాట్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు మహ్మదుల్లా వెల్లడించాడు. 2021లోనే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన అతడు.. వన్డేలలో మాత్రం కొనసాగనున్నాడు.*




## ఆర్చరీలో డీపీఎస్ అదుర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. గత రెండు రోజులుగా కొల్లూరులో జరుగుతున్న పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ టోర్నీలో 20 రాష్ట్రాలకు చెందిన దాదాపు 150 మందికిపైగా ఆర్చర్లు ఇందులో పోటీపడ్డారు. డీపీఎస్ ఆర్చర్లు ఏకంగా 22 పతకాలు కొల్లగొట్టి ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిల్ దక్కించుకున్నారు. వేర్వేరు వయసు విభాగపు కాంపౌండ్, రికర్వ్ పోటీల్లో 8 స్వర్ణాలు సహా 7 రజతాలు, 7 కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచారు. డీపీఎస్ చైర్మన్ భీంసేన్, కార్యదర్శి పవన్ విజేతలను అభినందించారు.

## అజర్‌పై ఈడీ ప్రశ్నల వర్షం

**సుదీర్ఘంగా సాగిన విచారణ**

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. మనీ లాండరింగ్‌కు పాల్పడ్డరన్న ఆరోపణల నేపథ్యంలో హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజారుద్దీన్.. మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యాడు. ఉదయం 11 గంటలకు ఈడీ ఎదుట హాజరైన అజర్‌ను అధికారులు సుదీర్ఘంగా విచారించారు. తన హయాం (2020-23)లో చోటు చేసుకున్న అక్రమాలపై పలు కేసులు నమోదైన నేపథ్యంలో అజర్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. ఏసీబీ నమోదు చేసిన రూ.20 కోట్ల కేసుతో పాటు ప్రస్తుత సీఈవో సునీల్ కాంటె వేసిన కేసు విషయంలో అధికారులు ఇప్పటికే పలు ఆధారాలు సేకరించారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో హెచ్‌సీఏలో తీవ్ర అవకతవకలు జరిగినట్లు వెల్లడైంది. ముఖ్యంగా డీజీ సెట్లు, ఫైర్ ఫైటింగ్ సిస్టమ్స్, కనోపీ మార్పే విషయంలో నిధుల గోల్‌మాల్ జరిగినట్లు తేలింది. అప్పటి కార్యవర్గంలో ఉన్న అపెక్స్ కౌన్సిల్ సభ్యులు ఇష్టారీతిన మార్కెట్ ధరకు మించి టెండర్ల జోలికి పనులు అప్పజెప్పినట్లు బయటపడింది. ఇదిలా ఉంటే కొంత మంది కావాలనే తనను ఇరికించేందుకు చూస్తున్నారని విచారణ సందర్భంగా అజర్ పేర్కొన్నాడు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.